క్లుప్తంగా

ఉపాధ్యాయుల కృషి అసామాన్యం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అసామాన్యమని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస బాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితచరిత్రను వివరించారు. ఫార్మసీ నిపుణులకు మన దేశం లోను, ఇతర దేశాల లోనూ ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, కళాశాల ఫార్మా డీ డైరెక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, సి.హెచ్.ప్రసాద రావు, డాక్టర్ వి.జవహర్ బాబు, జి.ఇందిరా ప్రియదర్శిని, జి.పూర్ణిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతోనే విజయాల సాధన



నగరంపాలెం: విజయం ఒక్క రోజులో రాదని, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వల్లే సాధ్యమవుతుందని చైతన్య ప్యాకేజెస్ ఎండీ తులసి యోగీష్‌చంద్ర అన్నారు. అమరావతిరోడ్డు హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు ఇటీవల ఏఎన్‌యూ ప్రకటించిన రెండో సంవత్సరం నాలుగో సెమిస్టర్ ఎంబీఏ, ఎంబీఏ హాస్పటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. ఈ మేరకు మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు లాస్‌లో పనిచేస్తున్న మొహమ్మద్ పాషా, రూబీ నసీర్‌మొహమ్మద్‌లు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా తులసి యోగీష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన అవార్డులు కృషికి ప్రతిఫలమని అన్నారు. ఇది ఒక ఆరంభమని, నిజమైన విజయమనేది విద్యార్థులు పొందే స్థానాల్లో, సమాజానికి అందించే సేవల్లో ప్రతిఫలిస్తుందని చెప్పారు.

తురకపాలెంలో ఎమ్మెల్యే రాత్రి బస

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో కొంత కాలంగా వరుస మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సోమవారం రాత్రి గ్రామంలో బస చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న అపోహలను తొలగించటానికి ఆయన స్వయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బస చేసేందుకు అధికారులు బెడ్లు, ఏసీలు ఇతర సౌకర్యాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్‌లో అందుబాటులో ఉంచారు. గత వారం రోజులుగా గ్రామంలో ఎటువంటి మరణాలు సంభవించ లేదని ప్రజలు ధైర్యంగా ఉండవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.


ఆత్మహత్యల నివారణపై అవగాహన



పెదకాకాని(ఏఎన్‌యూ): యువత మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆత్మహత్య నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆత్మహత్యల నివారణకు యువతలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయని, యువతలో మరింత మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. సైకాలజీ విభాగం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ నెల 10వ తేదీ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాలకు వెళ్లి సుమారు 300 మంది విద్యార్థులకు, వారి ద్వారా 1,300 మంది విద్యార్థులకు సైకాలజికల్‌గా ఫస్ట్ ఎయిడ్ చేసి జీవితంపై ఆశలను చిగురింపజేయడాన్ని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, ఆచార్య టి.డి.విమల, ఎస్.అనురాధ, ఆర్.ప్రమీలారాణి, కె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



ఫిర్యాదు పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్‌కు ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 31 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. సోమవారం జరిగే కార్యక్రమానికి క్షేత్ర స్థాయి అధికారులు కూడా హాజరైతే సమస్యల పరిష్కారం తేలిక అవుతుందని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో పీజీఆర్‌ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. పీజీఆర్‌ఎస్ ద్వారా 28 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 10, ఇంజినీరింగ్ విభాగం 6, రెవెన్యూ విభాగం 7, ప్రజారోగ్య విభాగం 2, ఉపా సెల్ విభాగం 1, ఎలక్షన్ సెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాస రావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంటమాలజీ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేయడం సరికాదు

నెహ్రూనగర్: నగరంలో హోల్ సేల్ కూరగాయల మార్కెట్ కోసం దరఖాస్తు చేయకుండానే నగరపాలక సంస్థ నుంచి అనుమతులు ఇవ్వడం లేదని అసత్య ప్రచారం చేయడం సరికాదని, నిర్దేశిత విధానం ద్వారా మార్కెట్ ఏర్పాటు కోరుతూ అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే వేగవంతంగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్‌లో చట్ట ప్రకారం 25 ఏళ్ల కాల పరిమితి ముగిసిన 81 షాపులకు ప్రభుత్వ నిబంధనల మేరకు రోస్టర్ పాటిస్తూ అదనపు కమిషనర్ నేతృత్వంలో మూడు రోజుల పాటు బహిరంగ వేలం నిర్వహించినట్లు చెప్పారు. గతంలో మార్కెట్ షాపుల నుంచి ఏడాదికి నగరపాలక సంస్థకు రూ.81 లక్షలు ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం వేలం ద్వారా రూ.6 కోట్లు ఆదాయం వస్తుందని వివరించారు. బహిరంగ వేలానికి ముందే అప్పటికే అక్కడ వ్యాపారం చేస్తున్న వారితో పలు దఫాలు ప్రజా ప్రతినిధుల సమక్షంలో వేలం నిర్వహించాలని, సహకరించాలని కోరగా కొంత గడువు అడిగారని, గడువు ముగిసిన తర్వాత షాపులు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వగా కొందరు కోర్టులో కేసులు దాఖలు చేశారన్నారు. హైకోర్టు కూడా కమిషనర్‌తో చర్చించుకోవాలని, కమిషనర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించి కేసులను డిస్పోజ్ చేయడం జరిగిందన్నారు. కాని కొందరి ప్రోద్బలంతో ఇప్పటి వరకు వ్యాపారాలు చేసిన వారు నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుని బ్లాక్ చేస్తూ, కనీసం ట్యాక్స్ కట్టని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో రైతులను మభ్యపెట్టి కూరగాయల వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. వారితో పలు దఫాలు చర్చించి, అనధికారిక మార్కెట్ నిర్వహణ చట్ట వ్యతిరేకమని, దరఖాస్తు చేసుకుంటే వేగంగా ఇతర శాఖల నుంచి అనుమతులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికి కనీసం దరఖాస్తు చేయకుండా జీఎంసీ అనుమతులు ఇవ్వడం లేదని అసత్య ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు.

ఐదు లక్షలు మొక్కలు నాటడమే లక్ష్యం..

ఈ ఏడాది మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా దశల వారీగా ఐదు లక్షలు మొక్కలు నాటాలని సంకల్పించామని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ సంస్థ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ద్వారా నగరంలోని డివైడర్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటడానికి సర్వే చేసి, టెండర్ ద్వారా మొక్కలను కొనుగోలు చేశామన్నారు. సదరు మొక్కలను ప్రైవేట్ నర్సరీల్లో కూడా విచారణ చేస్తే అందుకు తక్కువ ధరకే గ్రీనింగ్ కార్పొరేషన్ సరఫరా చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించిందని, ఇటీవల క్యాబినెట్‌లో అనధికార నిర్మాణాలను కూడా క్రమబద్ధీకరించుకోవడానికి నిర్ణయం తీసుకుందని ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోటరీ క్లబ్ ప్రతినిధులతో సమావేశం

నెహ్రూనగర్: ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవ్వాలంటే ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు, రోటరీ క్లబ్ భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు రోటరీ క్లబ్ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం



క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్ చూపుతున్న అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, నూరిఫాతిమా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నెహ్రూనగర్: కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరగడంతో పాటు అవస్థల పాలవుతున్నారని.. ముఖ్యంగా అన్నంపెట్టే రైతన్నను ఈ ప్రభుత్వం మరింత ఏడిపిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి రాంబాబు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం 43వ డివిజన్ పరిధిలోని అమరావతి రోడ్డులో డివిజన్ అధ్యక్షులు ఆరుమళ్ల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలోజరిగిన సమావేశానికి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని సక్రమంగా అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రైతులకు యూరియా అందనీయకుండా చేస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నట్లు చెప్పారు. రైతుల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడు ముందు వరసలో ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం జరిగే అన్నదాత పోరును జయప్రదం చేయాలని విన్నవించారు. మోదుగుల మాట్లాడుతూ చంద్రబాబు చేసే మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రవేశ పెట్టిన పథకాలు సక్రమంగా అమలు చేయలేక చతికిలపడిందన్నారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ కూటమి నేతలు ప్రతి పనిలో కమీషన్ వెతుక్కుంటూ ప్రతి ఒక్కరిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని వివరించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టర్ వద్ద జరిగే అన్నదాత పోరులో ప్రతి ఒక్కరూ పాల్గొని అన్నదాతలకు అండగా నిలిచి.. ప్రభుత్వానికి తగిన బుద్ధి తేవాలని కోరారు. అనంతరం డివిజన్ పరిధిలో ఎన్నికల సమయంలో, తరువాత నాయకులను, కార్యకర్తలను పోలీస్ కేసుల పేరుతో ఇబ్బందులు పెడుతున్న వారికి న్యాయపరంగా ఎన్నో సేవలందించిన అడ్వకేట్ రమావత్ లలితాబాయ్‌ను సన్మానించారు. తొలుత క్యూఆర్ కోడ్ స్కాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ ఫర్జానా, పార్టీ నాయకులు వంగల వలివీరారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పోకల వసంత్, గుమ్మ శివయ్య, పటాన్ సైదా ఖాన్, నందేటి రాజేష్, సూరసాని వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిజియోథెరపి కౌన్సిల్ ఏర్పాటు చేయాలి



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, గళ్లా రామచంద్రరావు

గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి పలు వృత్తుల వారిని ఎలైడ్ హెల్త్‌లో చేర్చిందని, అందులో నుంచి ఫిజియోథెరపిని వేరు చేసి ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఫిజియోథెరపిస్ట్‌లు కోరారు. వరల్డ్ ఫిజియోథెరపి డే సందర్భంగా సోమవారం రాజాగారితోటలోని టీటీడీ దేవస్థానంలో వేడుకలు నిర్వహించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ గళ్లా రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటకృష్ణ మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్‌లో ఫిజియోథెరపి వైద్య విభాగాన్ని బలోపేతం చేయాలని, నూతన వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. జీజీహెచ్ ఫిజియోథెరపి విభాగ అభివృద్ధికి హారిక ఫిజియోథెరఫీ కాలేజ్ రూ.50 వేలు విరాళం ప్రకటించారు. ఫిజియోథెరపిస్ట్‌ల పాత్ర సమాజంలో ఎంతో కీలకమని, సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హారిక కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ గ్రూప్ చైర్మన్ షేక్ మహినా సుభాని, కుగ్లర్ ఫిజియోథెరపి కాలేజ్ కరస్పాండెంట్ బెంజిమెన్, ఫిజియోథెరపిస్ట్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ సుభాని, సంఘం నేతలు డాక్టర్ ఏడుకొండలు, ఇమ్రాన్, రాజేంద్రప్రసాద్, దయాకర్, శిరీష, ఆదిత్య, హసీనా, ఖాజామొహిద్దీన్, నాగేంద్ర, ప్రభాకర్, మురళీధర్, గ్రేస్, దిలీప్, రోషన్ పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు అనుమతి లేదు

లక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు అనుమతి లేదని వెస్ట్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేనటువంటి ఎటువంటి కార్యక్రమాన్ని పోలీసు శాఖ అనుమతించదని చెప్పారు. ర్యాలీలు, ధర్నాలు, గుంపులు గుంపులుగా రావడానికి ముందస్తు అనుమతి తీసుకోలేదు కాబట్టి ఎటువంటి కార్యక్రమాలను అనుమతించడం లేదని వివరించారు.

సైబర్ సెక్యూరిటీపై శిక్షణ

పెదకాకాని: నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌లోని సాంకేతిక అధ్యాపకులకు సైబర్ సెక్యూరిటీ నెట్‌వర్క్ అంశాలపై సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిస్కో సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8 నుంచి 12వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తరగతులను సిస్కో సంస్థ సౌత్ ఆసియా హెడ్ ఇషాందర్ సింగ్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.అనీల్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిస్కో సంస్థ సౌత్ ఆసియా హెడ్ ఇషాందర్ సింగ్ మాట్లాడుతూ డిజిటల్ దాడుల నుంచి వ్యక్తులను, వ్యాపారాలను, ప్రభుత్వ సంస్థలను కాపాడటంలో సైబర్ భద్రత చాలా ముఖ్యమైనదన్నారు. ఆర్థిక లావాదేవీలను సైబర్ సెక్యూరిటీ సురక్షితం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ఎఫ్ఏఎస్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ జి.కిషోర్ కుమార్, సీమన్స్ సెంటర్ ఆఫ్ఎక్సలెన్స్ డైరెక్టర్ రావెల నవీన్, ప్రోగ్రామ్ సంధానకర్త నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డాక్టర్ గరికపాటి రాజారావుకు ఘన నివాళి



డాక్టర్ గరికపాటి రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

లక్ష్మీపురం: మాభూమి నాటకంతో ప్రజలను చైతన్య పరిచిన డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతిని సీపీఐ కార్యాలయం, మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజానాట్యమండలి అధికారులు, కళాకారులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ, రాజారావు నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా మాభూమి నాటకం ద్వారా ప్రజలను చైతన్య పరిచిన మహా నటుడు, దర్శకుడు అని గుర్తుచేశారు. పేదలకు ఉచిత వైద్యం చేయడం, అనేక మంది నటులను వెండితెరకు పరిచయం చేయడం, పుట్టిల్లు సినిమాతో జమునను గొప్ప నటిమణిగా తీర్చిదిద్దిన ఘనత కొనియాడారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి మిట్టపల్లి మహేంద్ర అధ్యక్షత వహించారు. సభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంత రావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల్ నాసర్, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల అంజి బాబు, బండారు యశ్వంత్ శశి, ప్రజానాట్యమండలి నగర అధ్యక్షుడు చెవుల పున్నయ్య, సీనియర్ కళాకారులు నూతలపాటి చిన్న, ఫణి భూషణ్ పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో 'హరిహంసిక'కు పతకాలు



పతకాలను సాధించిన విద్యార్థులు

తెనాలి: తెనాలికి చెందిన హరి హంసిక డ్యాన్స్ అండ్ తైక్వాండో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పలు బంగారు పతకాలను సాధించారు. ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఆదివారం 7వ జాతీయ స్థాయి సమురాయి, జపాన్ కరాటే, రాష్ట్రస్థాయి సెలభమ్ టోర్నమెంట్ జరిగింది. రోజంతా జరిగిన ఈ పోటీల్లో తెనాలిలోని హరి హంసిక డ్యాన్స్ అండ్ టేక్వాండో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని విభాగాల్లోనూ ప్రతిభను చాటి 15 బంగారు పతకాలు, అయిదు రజత పతకాలు, మరో అయిదు కాంస్య పతకాలను సాధించారు. పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, టోర్నమెంట్ నిర్వాహకులు కావూరి నరేందర్ రెడ్డి హరిహంసిక విద్యార్థులను అభినందించారు. అలాగే, తెనాలి లో సెలభమ్ కోచింగ్, ఆర్గనైజింగ్ బాధ్యతలను కోచ్ ఎం.చిన్న కేటాయించారు.

రైల్వే స్టేషన్‌లో నుంచి కాలేజీకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలి

జిల్లా కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

లక్ష్మీపురం: విద్యార్థులు గుంటూరు రైల్వే స్టేషన్‌లో నుంచి కళాశాలలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కలెక్టర్ నాగలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్ మాట్లాడుతూ ప్రస్తుతం శంకర్ విలాస్ ఫ్లైఓవర్ పనులు దృష్ట్యా అరండల్ పేట, బ్రాడీపేట వైపు ప్రభుత్వ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ ఏసీ కాలేజ్, ఉమెన్స్ కాలేజ్, హిందూ కాలేజీలలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాలేజీలకు వెళ్లేందుకు గతంలో శంకర్ విలాస్ బ్రిడ్జి మీద నుంచి నడుచుకుంటా వెళ్లేవారని, ప్రస్తుతం ఓవర్ బ్రిడ్జ్ మార్గం లేనందున కాలేజీలకు వెళ్లేందుకు రైల్వే స్టేషన్ లోపల నుంచి ప్రభుత్వం ఆసుపత్రి వైపు వెళ్తున్నారన్నారు. విద్యార్థులను రైల్వే అధికారులు ప్లాట్‌ఫాం టికెట్ తీసుకోలేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల అరండల్ పేట బ్రాడీపేట వైపు నుంచి కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు రైల్వే స్టేషన్ లోపల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని, లేదా బ్రాడీపేట ఒకటవ లైన్ నుంచి మెడికల్ కాలేజీ వైపునకు తాత్కాలిక ఇనుము బ్రిడ్జి నిర్మాణం చేయాలని అర్జీలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కే పవన్ కుమార్, నగర కార్యదర్శి యశ్వంత్, కమిటీ సభ్యులు భగత్ సింగ్ పాల్గొన్నారు.

అక్షరాస్యతతో సమాజాభివృద్ధి

సీఎల్‌పీటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు

గుంటూరు రూరల్: చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లోని నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా పలు పోటీలను నిర్వహించారు. అక్షరాస్యత మనుషుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి పునాదిగా నిలుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి, అక్షరాస్యత విలువలను అవగాహన చేయడం లక్ష్యంగా వివిధ పోటీలు నిర్వహించారు. లిట్రసీ ఫర్ మ్యూచువల్ అండర్‌స్టాండింగ్ అండ్ పీస్ అనే అంశంపై వ్యాస రచన పోటీలు, ఇంపార్టెన్స్ ఆఫ్ రీడింగ్ రైటింగ్ ఎడ్యుకేషన్ ఫర్ బెటర్ సొసైటీ అనే అంశంపై వక్తృత్వ పోటీలు, ఇంపాక్ట్ ఆఫ్ లిట్రసీ ఆన్ సొసైటీ అనే అంశంపై వన్ మినిట్ టాక్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ కేఎన్ రజనీకాంత్, డాక్టర్ జి.నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సువర్ణ కుటీర్ డెవలపర్స్‌పై రాళ్లతో దాడి

లక్ష్మీపురం: సువర్ణ కుటీర్ డెవలపర్స్ కార్యాలయంపై రాళ్లతో దాడి చేసి ఉద్యోగులను బెదిరించడంతో అరండల్‌పేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట 9/3వ లైన్‌లో సువర్ణ కుటీర్ డెవలపర్స్ అనే కార్యాలయం ఉంది. అయితే సోమవారం అద్దంకి క్రాంతి, శామ్యూల్ ఒక్కసారిగా కార్యాలయంపై రాళ్లతో దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. అడ్డు వచ్చిన ఉద్యోగులను చంపుతామని బెదిరించారు. అయితే సువర్ణ కుటీర్ డెవలపర్స్ నిర్వాహకులు అరండల్‌పేట పోలీసులకు సమాచారం తెలియజేయడంతో పోలీసులు ఘటనా స్థలం వద్ద విచారించగా సంస్థ నిర్వాహకులకు క్రాంతి, శామ్యూల్‌కు పాత గొడవల నేపథ్యంలో దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపాసికాన్– 2025లో జీఎంసీ పీజీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ సుందరాచారి, డాక్టర్ రమణ, డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల పీజీ విద్యార్థులు ఏపాసికాన్ 2025 రాష్ట్ర స్థాయి సదస్సులో నిర్వహించిన క్విజ్ పోటీలో రన్నరప్ స్థానాన్ని సాధించి కళాశాలకు గౌరవం, గుర్తింపు తెచ్చిపెట్టారు. ఈ బృందంలో డాక్టర్ లోహిత, డాక్టర్ కుసుమ వెంకట రాహుల్ రెడ్డి, డాక్టర్ పరితాల లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ సనికొమ్ము మణి భరగవ్ రెడ్డి ఉన్నారు. ప్రతిభ కనబర్చిన వైద్య విద్యార్థులను గుంటూరు జీజీహెచ్ శస్త్రచికిత్స విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వై.కిరణ్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోవింద్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగ సంతోష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ కుమార్ అభినందించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రతిభ కనబర్చిన వైద్య విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


పారిశుద్ధ్య కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం

బాండ్లు అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిటౌన్: తెల్లవారుజామున నాలుగ్గంటల్నుంచి కష్టించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అలాంటి శ్రామికులకు మెరుగైన ఆరోగ్యం కోసం మున్సిపాలిటీ నుంచి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. పట్టణ కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు తన సొంత ఖర్చుతో చేసిన ప్రమాద బీమా పత్రాలను మంత్రి అందజేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న 300 పారిశుద్ధ్య కార్మికులకు భరోసా కోసం బీమా కల్పించినట్టు చెప్పారు. ఒక్కొక్కరికీ రూ.5 లక్షల నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రమాద బీమాను కల్పించామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ తన ధ్యేయంగా చెప్పారు. ఆరోగ్య విషయంలో ఏ చిన్న ఇబ్బంది కలిగినా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని చెబుతూ, అక్కడ సరిగ్గా చూడకుంటే వెంటనే తనకు ఫిర్యాదు చేయాలని కోరారు. తెనాలి వైద్యశాల సేవలను మరింత బలోపేతం చేస్తామన్నారు. మురుగుకాల్వల ఆధునికీకరణ, చెత్తసేకరణలో కొత్త మార్పులు తీసుకు వస్తున్నామని, సిబ్బంది కూడా సహకరించాలని కోరారు. రాష్ట్రంలోని కోటీ 42 లక్షల తెల్లరేషను కార్డుదారుల కోసం ఒక్కొక్కరికీ రూ.25 లక్షల వరకు వైద్య సహాయం అందించేలా కొత్తగా పథకాన్ని తీసుకొస్తున్నట్టు చెప్పారు. త్వరలో అమలు కానుందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ అండగా ఉంటుందని చెప్పారు. కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఆరోగ్య అధికారి డాక్టర్ ఏసుబాబు పాల్గొన్నారు.

పిల్లల్లో స్వీయ అభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలి

జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ శ్రీవాణి



మాట్లాడుతున్న శ్రీవాణి

తెనాలిటౌన్: పిల్లల్లో స్వీయ అభివృద్ధికి తోడ్పాటును అందివ్వాలని జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ డి.శ్రీవాణి పిలుపునిచ్చారు. స్థానిక బోసురోడ్డులోని అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మిషన్ శక్తి డీహెచ్ఈడబ్ల్యూవో సంకల్ప కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న శిక్షణ తరగతులకు సోమవారం జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ శ్రీవాణి హాజరయ్యే మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల విద్య, వైద్యం, సంక్షేమం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పి.విజయగౌరి వెల్లడించారు. కార్యక్రమంలో డీవీసీ లీగల్ కౌన్సిలర్ కె.పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.సౌజన్య, యామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ ఘటనపై అరండల్‌పేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట 5వ లైన్ ప్రాంతానికి చెందిన శ్రీ హర్ష, ఈనెల 7వ తేదీన ఇంటి ముందు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ను పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయం చూసుకునే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతుకులాడిన ఎంతకు కనిపించ పోవడంతో సోమవారం రాత్రి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.